ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వైసీపీ అహంకారం అంతం అవుతుంది

» జూన్ 4న వేడుకలకు సిద్ధం కావాలి

» జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

- 7లో

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 15: సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములవద్ద భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా టీవీలను సెక్యూరిటీ సిబ్బంది వ్యవస్థను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుకు అవసరమైన పనుల నిమిత్తం జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఛాంబర్, మీటింగ్ హాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వేచిఉండే గది, ఇతర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జేఎన్‌టీయూ మెయిన్ గేటు నుంచి లోపలికి వచ్చేవారి వివరాలు పోలీస్ బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేఎన్‌టీయూ వద్ద బందోబస్తును మరింత పటిష్ఠం చేయాలన్నారు.

నేటినుంచి ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షలు

» మొత్తం 3,61,640 దరఖాస్తులు

» 16 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు

» కాకినాడ జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్న 11,509 మంది విద్యార్థులు

» సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి

- 7లో

జూన్ 9న అరసం మహాసభ - 7లో

వలస ఓటర్లు తిరుగు పయనం - 7లో

ఫ్చ్ ఎన్నో స్త్రాయో

» జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై వైసీపీలో నిరాశ నిస్పృహలు

» భారీ పోలింగ్ జరగడంతో వ్యతిరేక ఓటు కొంప ముంచేస్తుందని లెక్కలు

» ప్రభుత్వంపై ఓటర్లు భారీగా ఆగ్రహావేశాలు ప్రదర్శించారన్న విశ్లేషణలతో బెంబేలు

» బయటకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల ఓటమి భయం

» ప్రజల్లో భూహక్కుచట్టం భయం పార్టీకి పెద్ద దెబ్బకొట్టినట్లు అంగీకారం

» వైసీపీ వైఫల్యాలు, పెరిగిన ఓట్లశాతం, యువత అండతో కూటమిలో ధీమా

» రాబోయే ఎన్నికల ఫలితాలపై వేటికవే పార్టీల్లో సొంత విశ్లేషణలు

» ఫలితాలపై బెట్టింగ్‌లన్నీ టీడీపీకి అనుకూలంతో వైసీపీలో కలవరం



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు నాడిపై అధికార వైసీపీ, టీడీపీ విశ్లేషణలు జోరందుకున్నాయి. పోలింగ్ ముగియడం, ఓట్ల లెక్కింపునకు చాలా రోజులు ఉండడంతో ఎన్నికల జరిగిన తీరుపై వేటికవే విశ్లేషణలు జరుపుతున్నాయి. భారీగా పోలింగ్ జరగడం తమకు అనుకూలమని టీడీపీ లెక్కలు వేస్తుండగా వెల్లువెత్తిన ప్రజావ్యతిరేకత తమను కచ్చితంగా ముంచేస్తుందన్న భయం వైసీపీని వెన్నాడుతోంది. మరోపక్క ప్రభుత్వ వైఫల్యాలు, కూటమిగా జనంలోకి వెళ్లడం, మేనిఫెస్టో తమకు కలిసి వస్తోందని విజయంపై టీడీపీ ధీమా కనబరుస్తోంది. ఎప్పుడూ లేనివిధంగా యువతరం సైతం బూత్‌లకు పోటెత్తడంతో కచ్చితంగా ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయన్న విశ్వాసం టీడీపీలో కనిపిస్తోంది. అటు తమ ప్రభుత్వం తెచ్చిన భూహక్కు చట్టంపై ప్రజల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తించి ఓటింగ్‌లో తీవ్ర డ్యామేజీ చేసిందన్న వాస్తవాన్ని వైసీపీ అంగీకరిస్తోంది. అటు జిల్లాలో పోలింగ్ సరళిని విశ్లేషించిన ఐప్యాక్ సైతం భూహక్కు చట్టం వైసీపీకి ఎన్నికల్లో పెద్ద దెబ్బే కొట్టిందని అంచనాకు వచ్చింది. కళ్ల ముందే ఓటమి భయం కనబడుతున్నా వైసీపీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. ప్రధానంగా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు బయటకు గంభీరంగా ఉన్నా అంతర్గతంగా క్యాడర్ వద్ద ఓటమి భయం ప్రస్తావిస్తూ నెత్తీనోరు బాదుకుంటున్నారు. కాగా జిల్లాలో ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లన్నీ టీడీపీ, జనసేనకు అనుకూలంగా ఉండడంతో రాబోయే తీర్పు ముందే వైసీపీని ఆందోళనకు గురిచేస్తోంది.

అటు ధీమా.. ఇటు కలవరం..

అసెంబ్లీ ఎన్నికలు పూర్తవడంతో పోలింగ్ తీరుపై అధికార వైసీపీని వణికించేస్తోంది. ఎవరూ ఊహించనంత భారీగా ప్రజలు ఓటెత్తడంతో ప్రభుత్వ వ్యతిరేక సునామీ తమను ముంచేయడం ఖాయమన్న అంచనాలు వైసీపీకి కునుకు పట్టనీయడం లేదు. సాధారణంగా పోలింగ్‌శాతం 60 నుంచి 70 మధ్యలో ఉంటే ఏదోలా వ్యతిరేకత తగ్గి అత్తెసరు మెజార్టీతో అయినా గట్టెక్కవచ్చని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు లెక్కలు వేసుకున్నారు. కూటమిగా టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి రావడంతో ఆ ప్రభావంతో ఓట్లు చీలి తమవైపు వస్తాయన్న నమ్మకం లేకపోవడంతో కనీసం డబ్బు, మద్యం ప్రభావంతో ఏదోలా గట్టెక్కుతామన్న అంచనాలు అభ్యర్థులు వేసుకున్నారు. కానీ పోలింగ్ జరిగిన తీరు వైసీపీ నేతల లెక్కలను పూర్తిగా తారుమారు చేసేశాయి. అంత భారీ పోలింగ్‌శాతంతో తమకు నష్టం గట్టిగా ఉండబోతుందన్న భయం వీరిని కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేకత ఒకెత్తయితే జగన్ ప్రభుత్వం తెచ్చిన భూహక్కు చట్టం ప్రజల్లో తీవ్ర భయాందోళనలను ఎన్నికల ముందు మరింత పెంచేసింది. ఒకవేళ వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు గాల్లోదీపాలే అని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత జగన్ నేరుగా ప్రజల్లోకి లోతుగా తీసుకువెళ్లారు. దీంతో అభయం ఎన్నికల్లో ఓటెత్తి వైసీపీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్న విషయాన్ని విశ్లేషించుకుంటున్నారు. పార్టీకి సంబంధించిన ఐప్యాక్ సైతం పోలింగ్ సరళి తర్వాత ఇదే కొంప ముంచబోతుందన్న లెక్కలను పార్టీ అభ్యర్థులకు వివరించింది. పవన్‌కళ్యాణ్ ప్రభావం సైతం జిల్లాపై భారీగా పడిందన్న విశ్లేషణలు వైసీపీలో వ్యక్తమవుతున్నాయి. ఆయన కాకినాడ పార్లమెంట్ పరిధిలో అన్నినియోజకవర్గాల్లో రోడ్‌షో, సభలు నిర్వహించి యువతను కదిలించారు. తనకు దండలేయడం కాదని, ఓట్లేసి విజయ తీరాలకు కూటమిని చేర్చాలంటూ పదేపదే పిలుపునిచ్చారు. ఈ కారణంతోనే యువతరం ఈసారి భారీగా ఓటింగ్‌లో పాల్గొనడానికి కారణమనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాము అనుకున్న ఫలితాలు వైసీపీకి రాకుండా పోతున్నాయనే అంచనాలు వైసీపీలో కలవరం రేపుతున్నాయి. అటు పిఠాపురంలో పవన్ ఓటమికి తమ పార్టీ అవసరానికి మించి చేసిన అతి, ఖర్చు సైతం బూమరాంగ్ అయిందన్న ఆగ్రహం పార్టీ నేతల్లో వ్యక్తమైంది. పవన్ ఓటమికి తమ పార్టీ అన్ని రకాల అడ్డదారులు తొక్కుతుందన్న విషయం ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడంతో కసిగా ఓటర్లు ఈవీఎంలు నొక్కారనే భావన ఆ పార్టీ అభ్యర్థుల్లోనే వ్యక్తమవుతోంది. అటు రాష్ట్రవ్యాప్తంగాను సీట్లు తమ పార్టీకి పెద్దగా రావని, ఓటమి ఖాయమంటూ జరుగుతున్న ప్రచారం వైసీపీ నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికలు జరిగిన తీరుపై చాలా ధీమా వ్యక్తం చేస్తున్నారు. మేనిఫెస్టో, కలిసికట్టుగా ప్రయాణించడంతో ఓట్ల సమీకరణ జరిగి విజయానికి పునాదులు పడేలా చేసిందని నియోజకవర్గాల్లో అభ్యర్థులు అంచనాకు వచ్చారు. మహిళలు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్ని వర్గాల్లో వైసీపీపై వ్యతిరేకతను ఓటుతో చాటినట్లు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అన్ని సీట్లు స్వీప్ చేస్తామనే విశ్వాసం కనబరుస్తున్నారు.

కాసులు కాసేవారేరి?

పోలింగ్ పూర్తవడంతో ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై అప్పుడే బెట్టింగ్‌లు కోట్లలో జరుగుతున్నాయి. ఫలానా నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తోంది? జిల్లాలో టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయి? వైసీపీకి ఎన్ని వస్తాయి? పిఠాపురంలో పవన్ మెజార్టీ ఎంత? అనేదానిపై అప్పుడే జిల్లావ్యాప్తంగా రూ.300కోట్లకుపైగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. 80శాతం మంది బెట్టింగ్‌లు టీడీపీ కూటమికి అనుకూలంగానే కాస్తున్నారు. అటువైపు వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్‌లు వేయడానికి పెద్దగా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో టీడీపీ, జనసేనకు అనుకూలంగా వారిలో వారే సీట్లు, మెజార్టీలపై పందేలు కాస్తున్నారు. ప్రధానంగా పెరిగిన ఓటింగ్, సర్వేలన్నీ కూటమివైపే మొగ్గు చూపుతుండడంతో వైసీపీ వైపు డబ్బులు కట్టేవారు పెద్దగా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లు జరుగుతున్న తీరు సైతం వైసీపీకి అనుకూల ఫలితాలు రావనే విషయాన్ని తేటతెల్లం చేస్తుండడంతో వైసీపీకి ఏం పాలుపోవడం లేదు.

ఎండిపోయిన 'పంపా'



అడుగంటిపోయి ఎడారిని తలపిస్తున్న పంపా రిజర్వాయర్

» రిజర్వాయర్‌లో అడుగంటిన జలాలు

» గ్రామస్థులు, భక్తులకు పొంచి ఉన్న నీటికష్టాలు

అన్నవరం, మే 15: మెట్టప్రాంత రైతులకు వరప్రదాయినిగా ఉన్న పంపా రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోవడంతో ఎడారిని తలపిస్తోంది. ఈ రిజర్వాయిర్ ద్వారా ఖరీఫ్, రబీ పంటలు సాగుచేయడమే కాకుండా రత్నగిరిపై భక్తుల నీటి అవసరాలు, గ్రామంలో భూగర్భ జలాలుకు ఈ రిజర్వాయర్ ప్రధాన ఆధారం. 105 అడుగులు గరిష్ఠ నీటిమట్టం కాగా 12వేల ఎకరాలకు నీరందిస్తుంది. రిజర్వాయర్‌లో మట్టిని తొలగించి మూడు దశాబ్ధాలు అవడంతో కొద్దిపాటి వర్షాలకు వెంటనే రిజర్వాయిర్ నిండిపోతుంది. రాజకీయ నాయకులు మాత్రం ఈ రిజర్వాయర్‌లో పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంపా రిజర్వాయర్‌లో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో రత్నగిరికి విచ్చేసే భక్తులకు నీటికష్టాలు మొదలవుతున్నాయి. కొండ దిగువన ఉన్న మోటార్ల ద్వారా నీటిని కొండపైకి సంపులోకి నింపుతుంటారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వలు లేకపోవడంతో భక్తులను నీరు పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నారు. గ్రామంలో బోర్లకు సైతం రిజర్వాయర్‌లో నీటినిల్వలను బట్టే అవసరాలు తీరుతున్నాయి. త్వరలో ప్రారంభంకానున్న సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాల్లో స్వామి వారి చక్రస్నానం పంపా రిజర్వాయర్‌లో నిర్వహిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఆర్డీవో అధ్యక్షతన జరిగిన వివిధ శాఖల సమన్వయ సమావేశంలో ఎండిపోయిన పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో పుష్కరకాలువ, ఏలేరు రిజర్వాయర్ నీటిని తీసుకోవాలని ఆదేశించడంతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈలోగా వర్షాలు పడితే కొద్దిమేర కష్టాలు గట్టెకుతాయని భావిస్తున్నారు. పంపా రిజర్వాయర్‌లో ప్రతిఏటా వేసవిలో ఏర్పడే ఈ సమస్యకు తుని నియోజకవర్గ నాయకులు దృష్టిసారించి రిజర్వాయర్ ప్రాంతంలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి మట్టిదిబ్బలు తొలగించాల్సిన ఆవశ్యకత ఉంది. తద్వారా సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తవని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మొత్తం 81.43శాతం



» జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ 18,522

» దీనిలోనే అత్యవసర సేవలు, హోమ్ ఓటింగ్

» మొత్తం వీవీఎం డైరెక్ట్ ఓటింగ్ 80.30శాతం

» పోస్టల్ బ్యాలెట్ కలపగా 81.43 శాతం

కలెక్టరేట్(కాకినాడ), మే 15: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు దండిగా పడ్డాయి. మొత్తం 18,522ఓట్లు నమోదయ్యాయి. ప్రభుత్వఉద్యోగాలు, అత్యవసర సేవలను అందించేవారు, దేశరక్షణ విభాగంలో ఓటర్లు దీనిలో ఉన్నారు. ఇది జిల్లా ఓటర్లను అనుసరించి పర్సంటేజ్ లెక్కపెట్టగా 1.33 శాతంగా నమోదైంది. అంటే జిల్లాలో ఈనెల 13న డైరెక్ట్ ఓటింగ్ ద్వారా పోలైన 13,12,255 ఓట్లు(80.30 శాతానికి) కలిపితే 81.43శాతంగా నమోదైంది. ఇది జిల్లాలో రికార్డు సృష్టించింది. దీనిలో కాకినాడ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు 14,463మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేశారు. ఇతర జిల్లాల వారు 2930మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించారు. అత్యవసర సర్వీస్ ఉద్యోగులు 404 ఓట్లు, ఇంటివద్ద 607మంది ఓటు వేశారు. దేశరక్షణ విభాగంలో ఉన్నవారు 58మంది ఓటువేశారు. మొత్తంగా 18,522మంది పోస్టల్ బ్యాలెట్ వేశారు. దేశరక్షణ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల ఓట్లు తంతి తపాలాశాఖ ద్వారా ఇంకా వస్తున్నాయి. దీంతో ఈ సంఖ్య మరింతగా పెరగొచ్చు.

పోస్టల్ బ్యాలెట్ కాకినాడ రూరల్ అత్యధికం

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు జిల్లాలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 4829 ఓట్లు పోలయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో అత్యల్పంగా 1635 ఓట్లు పోలయ్యాయి. తుని నియోజకవర్గంలో 2176 ఓట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 1778 ఓట్లు, పిఠాపురం నియోజకవర్గంలో 2464 ఓట్లు, పెద్దాపురం నియోజకవర్గంలో 2074 ఓట్లు, కాకినాడ సిటీ నియోజకవర్గంలో 3566 ఓట్లు పోలయ్యాయి.

వేసవి అలవెన్స్‌లు ఎక్కడ?

» వేతనాలూ ఆలస్యమే

» 'ఉపాధి' పనులపై ఆసక్తి చూపిన కూలీలు

» నీరుగారుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం



గండేపల్లి, మే 15: నిరుపేదలకు ఉపాధి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రోజురోజుకూ నీరుగారుతోంది. గతంలో పనికి వెళ్తే వేతనాలు వెంటనే పడేవి. ప్రస్తుతం పనిచేసినా ఐదు, ఆరు వారాలకు కూడా వేతనాలు పడకపోవడం, పనికి తగ్గ కూలీ రాకపోవడం వంటి కారణాలతో ఉపాధి పనిపై కూలీలు ఆసక్తి తగ్గిస్తున్నారు. ఎండాకాలం వచ్చిందంటే వేసవి భత్యం కింద పరికరాలకు అదనంగా సొమ్ములు వేసేది ప్రభుత్వం. గడ్డపారకు రూ.10, మంచినీటికి రూ.5, తట్టకు రూ.5 వేసవి అలవెన్స్‌లుగా ఉండేవి. రెండేళ్లుగా అవి కూడా రావడం లేదని కూలీలు అంటున్నారు. కనీసం పనిచేసే సమయంలో ఏ చిన్నగాయమైనా ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి కిట్లు ఇచ్చేవారని, అవి కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో టెంట్‌లు ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ పంపిణీ వంటివి కూడా ఉండడం లేదని, ఉపాధి హామీని రోజురోజుకూ నీరుకారుస్తున్నారని కూలీలు వాపోతున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మండుటెండలో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అలవెన్స్‌లు సరిగా రాకపోవడంతో జిల్లావ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోతోందని తెలుస్తోంది.

ఈవీఎంల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

» కౌంటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్

» ఎస్పీ సతీష్ కుమార్



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, మే 15: ఈవీఎంల వద్ద భద్రత విషయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా జేఎన్టీయూకే కాలేజీ చుట్టూ అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. కాకినాడ జేఎన్టీయూకే కాలేజీలో బుధవారం ఏర్పాటు చేసిన క్యాండిడేట్స్, స్ట్రాంగ్ రూమ్స్ ఏజెంట్స్‌స్ట్రాంగ్ రూమ్స్ వ్యూవింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని పరిశీలించి రక్షణగా ఉన్న సిబ్బంది, ఇన్‌చార్జిలకు తగిన సూచనలు చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు కాలేజీ లోపలికి రావడానికి జేఎన్‌టీయూ కాలేజీ గేటువద్ద ఉన్న సెక్యూరిటీ ఇన్‌చార్జి, సంబంధిత పోలీస్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతరంగా సీసీ కెమెరాలు పర్యవేక్షించేలా పోలీసు పహారా చేయాలని ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, ఈవీఎం గార్డ్స్ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి.సత్యనారాయణ, ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, డీఎస్పీలు, సీఐలు ఉన్నారు.

సారా జోరు

» ఏజెన్సీ నుంచి అర్ధరాత్రులు సారా దిగుమతి?

» యథేచ్ఛగా విక్రయాలు

» కానరాని ఎస్ఈబీ అధికారులు



గండేపల్లి, మే 15: నాటుసారా జోరు ఈ మధ్య కాలంలో ఊపందుకుంది. రాత్రివేళల్లో ఏజెన్సీ మండలాల నుంచి గండేపల్లి మండలంలోని గ్రామాలకు రహస్యంగా సారా దిగుమతి జరుగుతున్నట్లు సమాచారం. గండేపల్లి మండలంలో చాలా చోట్ల నాటుసారా స్థావరాలు ఉండేవి. దీంతో పోలీసులు వాటిపై తరచూ దాడులు నిర్వహించడంతో ఈప్రాంతంలో సారా తయారీ తగ్గిపోయింది. మరుగు కూడా తక్కువ ఉండడంతో వ్యాపారులు కాయడం మానేసి ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో అధికసంఖ్యలో వందలలీటర్లు దిగుమతి చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గోకవరం మండలం తిరుమలాయపాలెం మీదుగా కె.గోపాలపురం, అటు నుంచి ఉప్పలపాడు, మల్లేపల్లి, తాళ్లూరు, గండేపల్లికి వివిధ మార్గాల్లో సారా తరలిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా సారా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటినుంచి మద్యం దుకాణాల్లో నిబంధనల ప్రకారం మద్యం బాటిళ్ల అమ్మడం, ఒక్కొక్కరికి ఒక్క బాటిల్ మాత్రమే ఇవ్వడంతో మందుబాబులు సారా మీద ఆసక్తి చూపిస్తున్నారు. ఏ సమయంలోనైనా సారా దొరకడంతో మందుబాబులు సారా తాగుతున్నారు. ఈసారా వల్ల కిడ్నీలు పాడైపోవడం, కంటిచూపు తగ్గిపోయే అకాశాలున్నాయని పలువురు హెచ్చరిస్తున్నారు. మందు అమ్మకాలు తగ్గడంతో బెల్టు షాపుల్లో సారా ప్యాకెట్లు అమ్ముతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఎవరూ సంచరించని ప్రాంతాలను ఎంచుకుని సారా తరలింపు చేపడుతున్నారు. రోజూ రాత్రివేళల్లో గ్రామశివారున పామాయిల్‌తోటలు, చెరువు గట్ల వద్ద సారా విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా తాగిపడేసిన సారాప్యాకెట్లు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎస్ఈబీ అధికారులు మచ్చుకు కూడా కానరావడంలేదు. అడపాదడపా లోకల్ పోలీసులే దాడులు నిర్వహిస్తున్నారు తప్పితే దానికి సంబంధించిన ఎస్ఈబీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. దాడి చేయడానికి వస్తున్నారని ముందస్తు సమాచారం రావడంతో సారా వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో సారాను చాలా చోట్ల భద్రపరుస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ పోలింగ్.. ఎవరికి లాభం, ఎవరికి నష్టం!

» పెద్దాపురంలో ఎవరికి వారే గెలుపుపై ధీమా - 8లో

ఆవకాయ ఘాటే

» తగ్గిన పచ్చడి కాయ దిగుబడి - 7లో

ఎనిమిది కాసుల బంగారం చోరీ

» చెరకు రసంలో మత్తుమందు కలిపి ఆభరణాలు చోరీ చేసిన మహిళ - 7లో

నేటి నుంచి ఏపీఈఏపీసెట్

- మొత్తం 3,61,640 దరఖాస్తులు
- 16 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం
- సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి


కన్వీనర్ వెంకటరెడ్డి

జేఎన్టీయూకే, మే 15: ఏపీలో 47, తెలంగాణలోని 2, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 23 వరకూ నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్‌కు మొత్తం 3,61,640మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇంజనీరింగ్‌కు 2,73,010 మంది, అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 87,419 రెండింటికీ 1211 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 7న విడుదల చేశామని విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టిక్కెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్‌ను ఎంటర్ చేసి హాల్ టికెట్లను పొందవచ్చన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు 16నుంచి 17వరకూ, ఇంజనీరింగ్ పరీక్షలు 18 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని హాల్‌టికెట్లను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ కె.వెంకటరెడ్డి సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య, విద్యుత్, పోలీస్ అధికారులకు, అన్ని జిల్లాల అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2342499, 2359599 నెంబర్లలో కానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 11,509 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో నిర్వహించనున్నామన్నారు. మొత్తం 8రోజులపాటు ఆన్‌లైన్‌లో జరిగే అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలకు 3620మంది విద్యార్థులు, ఇంజనీరింగ్ పరీక్షలకు 7865 మంది, రెండింటికీ 24మంది విద్యార్థులు హాజరుకానున్నారని కన్వీనర్ తెలిపారు. అమలాపురం పరిధిలోని భట్లపాలెంలో ఉన్న బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రాజమహేంద్రవరం పరిధిలోని లూథర్‌గిరిలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లోనూ పరీక్షలను నిర్వహించనున్నామన్నారు.

స్నానానికి దిగి విద్యార్థి మృతి


విద్యార్థి బాలాజీ

కొవ్వూరు, మే 15 : గోదావరి నదిలో స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదీలో మునిగి విద్యార్థి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజీ(24) ఏఎస్ఆర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని విజ్జేశ్వరం బ్యారేజ్ 36వ గేట్ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. నది లోతును గమనించకుండా గోదావరిలో దిగడంతో ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

ఆత్రేయపురం, మే 15: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తూ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మోదుగుంటకు చెందిన ఆరేపల్లి శ్రీరామ్ (22) బుధవారం సాయంత్రం మిత్ర బృందంతో కలిసి గోదావరి బ్యారేజీని సందర్శించారు. ఆటపాటలతో సందడి చేస్తూ ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం వేళ ర్యాలి ఆర్మ్ అడ్డుకట్ట వద్ద స్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికులు గాలించి అతడిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న శ్రీరామ్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి




రాజారావు

రావులపాలెం, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోటలోని ఓ ప్రైవేటు కంపెనీలో కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన అజ్జరపు రాజారావు (60) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విధులు ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న ఓ హోటల్ సమీపంలో సైకిల్‌పై ఆగి ఉండగా తాడేపల్లిగూడెం నుంచి రంగంపేట వెళ్తున్న పాల ట్యాంకరు వేగంగా వచ్చి బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై రాజారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసి మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

స్వాధార్ హోమ్ తనిఖీ


వివరాలు సేకరిస్తున్న జడ్జి ప్రకాష్‌బాబు

రావులపాలెం, మే 15: రావులపాలెంలోని స్వాధార్ హోమ్ (శక్తి సదన్)ను రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పడక గదులు, వంట గది, డైనింగ్ హాల్ పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో ఉన్న వారు, నిర్వాహకుల సమక్షంలో రికార్డులను పరిశీలించారు. యాజమాన్యం ఎలా చూస్తోంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా సౌకర్యాల కల్పనలో చెప్పాల్సింది ఏదైనా ఉందా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోమ్ నిర్వాహకులతో మాట్లాడుతూ హోమ్‌లో ఉన్న వారికి ఏ రకమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఈ ఏడాది ఆవకాయ ఘాటే





- తగ్గిన పచ్చడి కాయ దిగుబడి
- ఘాటెక్కిన కారం..
- మరుగుతున్న నూనెల ధరలు
- వంద కాయల పచ్చడికి రూ.10 వేలు ఉండాల్సిందే

పెద్దాపురం, మే 15 : పచ్చళ్ల సీజన్‌కు ఎన్నికలు అడ్డుపడ్డాయి. పోలింగ్ ముగియడంతో ఆవకాయ పచ్చడిపై మహిళలు దృష్టి సారించారు. వేసవిలో ఆవకాయ, మాగాయి, వంటి పచ్చళ్లు పెట్టుకోవడం సర్వసాధారణం. కూరలేకపోయినా పర్వాలేదు ఆవకాయ పచ్చడి ఉంటే చాలు అన్నంతో కడుపు నింపేసుకుంటారు. కొంతమందికి ఆవకాయ రుచి తగలనిదే ముద్ద దిగదు. సాధారణంగా మే నెల వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో పచ్చడి తయారీ సందడి కనిపిస్తుంది. పది రోజుల ముందు నుంచే తయారీకి అవసరమైన సరుకులు సిద్ధం చేసుకుంటారు. ఇది ఆవకాయ పచ్చడికి ఉన్న డిమాండ్. అయితే ఈఏడాది ఆవకాయ పచ్చడి ఘాటెక్కింది. పచ్చడి పెట్టాలంటే ప్రస్తుత ధర ప్రకారం చేతిలో సుమారు రూ. 10 వేలు ఉండాల్సిందే. అదే 50 కాయలతో అయితే సుమారు రూ. ఐదు వేలు చేతిలో ఉండాల్సిందే. దీనికి కారణం పచ్చడి కాయ దిగుబడి తగ్గిపోవడం, తయారీకి అవసరమైన సరుకుల ధరలు కొండెక్కడమే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పచ్చడి మామిడి కాయ ఎక్కువగా దివాన్‌చెరువు, రాజానగరం, గోకవరం, తుని, ఏజెన్సీ మండలాలనుంచి, అలాగే కొన్ని మెట్ట ప్రాంతాల నుంచి మామిడికాయ వచ్చేది. వాతావరణం అనుకూలించక పోవడంతో ఈ ఏడాది చాలాచోట్ల పూతదశలోనే రాలిపోయింది. అక్కడక్కడ అరకొరగా కాయలు కనిపిస్తున్నాయి. సాధారణంగా పచ్చడికాయ ధర కాయ సైజును బట్టి ఉంటుంది. సాధారణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో కొత్తపల్లి కొబ్బరి, దేశవాళీ హైజర్లు, చిన్న, పెద్ద రసాలు, ఆవకాయ పచ్చడికి వాడుతుంటారు.. ఎక్కువకాలం ముక్క మెత్తబడకుండా ఉండేందుకు కాయ కొనుగోలు చేసేటప్పుడు రాజీపడరు. గతంలో ఈరకం కాయలు కొత్తపల్లికొబ్బరి 100 కాయలు రూ.3500 ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో కాయ రూ. 30 నుంచి రూ. 35 వరకూ సైజును బట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక పచ్చడి కారం ప్రధానం. గతంలో ఎన్నడూలేని విధంగా మిరప ధరలు ఘాటెక్కాయి. అలాగే కాయ ముక్కలు చేయడానికి రూ.3, గానుగ నూనె (నువ్వుల నూనె) లీటరు రూ.600, వేరుశెనగ నూనె రూ. 180, పచ్చడి కారం కిలో రూ. 800 క్వాలిటీని బట్టి పలుకుతోంది. ఇవన్నీ కాకుండా బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుతం రూ. 850 పైనే ఉంటోంది. వంద కాయలు పచ్చడి పెట్టాలంటే రూ. 10 వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన నూనె ధరలను చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆవకాయ పెట్టగలమా అనే ఆందోళనలోకి వచ్చారు.

సామగ్రి ధరలు పెరిగాయి



పచ్చడికి అవసరమైన సామగ్రి ధరలు ఇప్పటికే పెరిగిపోయాయి. అలాగే కాయ ధర కూడా పెరిగింది. కనీసం 50 కాయలతో పచ్చడి పెట్టాలంటే రూ. 4 వేల నుంచి ఐదు వేలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఏడాది అంతా పచ్చడి నిల్వ ఉండాలంటే సరుకుల కొనుగోలులో రాజీ పడకూడదు. కాయ దగ్గర నుంచి అన్నీ నాణ్యమైనవే కొనాలి. ఎం.జ్యోతీసీతారత్నం, గృహిణి

రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరం

క్షతగాత్రులను పరామర్శించిన హరీష్‌మాధుర్


క్షతగాత్రులను పరామర్శిస్తున్న హరీష్‌మాధుర్

కొత్తపేట, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరమని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ప్రమాద వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నామన ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు తక్షణం సాయం కింద రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నామన రాంబాబు, తోలేటి సత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మీభాస్కరరావు, గుబ్బల మూర్తి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామన పరామర్శ

అమలాపురం రూరల్, మే 15: పి.గన్నవరం మండలం ఉడిమూడి చింతావారిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్‌ను జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదిమూలం సూర్య, తిరుమనాథం కిరణ్ తదితరులు ఉన్నారు.

కాటన్ జయంతి వేడుకలు


కాటన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

కడియం, మే 15: కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కర రెడ్డి (కందరెడ్డి) ఆధ్వర్యంలో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కందరెడ్డి తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు కాటన్ విగ్రహం వద్ద ప్రతీ ఏటా కాటన్ జయంతి వేడుకలను ఓ ఉత్సవంలా నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం కాటన్ విగ్రహానికి ధాన్యం, క్షీరం, గోదావరి నదీజలాలతో అభిషేకించి పట్టు వస్త్రాలను సమర్పించారు. గ్రామంలో రైతులను ఆహ్వానించి తేనేటి విందు ఇచ్చారు. కందరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ ఇంజనీర్‌గా మన దేశానికి వచ్చిన కాటన్ దొర కాటన్ బ్యారేజీ నిర్మించడంతో రైతుల పాలిట ఆపద్బాంధవునిగా మారారన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో అపర భగీరథునిగా నిలిచిన కాటన్ మహాశయునికి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దూడల నాగేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, కాయల సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అహంకారం అంతం

జూన్ 4న వేడుకలకు సిద్ధంకండి

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు, మే 15: ప్రజాతీర్పుతో వైసీపీ అహంకారం అంతమవుతుందని, జూన్ 4న వేడుకలకు సిద్ధం కావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్‌హాలులో బుధవారం జరిగిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలింగ్‌బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని ప్రకటించిన నాటి నుంచి ఈవీఎంలో ఆఖరి ఓటు పడే వరకూ అలుపెరగకుండా పనిచేసిన, శ్రమించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు ఆయన అభినందనలు తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అందరూ బలంగా నిలబడ్డారని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరూ కులమతాలు గురించి మాట్లాడవద్దని, పవన్‌కల్యాణ్‌కు కులమే లేదని తెలిపారు. జనసైనికులకు ఆవేశం ఉండవచ్చని, అనవసర ఆవేశం వద్దని చెప్పారు. తప్పు ఎక్కడయినా జరిగితే నిలదీయాలని సూచించారు. కార్మికుల కష్టానికి చిహ్నమైన ఎర్ర తువ్వాలు తొలగించాలని పలు చోట్ల వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేశారని విమర్శించారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీతను మర్యాదగా పలకరించాలని, ఆడపడుచుగా గౌరవించాలన్నారు. అంతే తప్ప ఎగతాళి చేయవద్దని తెలిపారు. అది జనసేన సిద్ధాంతం కాదన్నారు. ఆమె ప్రస్తుతం చెడువైపు నిలబడిందని చెప్పారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు బి.మహేందరరెడ్డి, వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ పంచకర్ల సందీప్, తుమ్మలపల్లి రమేష్, అనిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురంలో ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి ఆధ్వర్యంలో యూఎస్ఏ ఎన్ఆర్ఐ జనసైనికులు అందించిన సేవలు అభినందనీయమని నాగబాబు పేర్కొన్నారు. పిఠాపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకూ వారు అందించిన సేవలను ప్రశంసించారు.

ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్, మే 15: ఏపీఆర్జేసీ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటారు. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపీసీలో 1వ ర్యాంక్, 2వ ర్యాంక్, బైపీసీలో 2వ ర్యాంక్ తో పాటు టాప్ టెన్‌లో ఎనిమిది ర్యాంక్‌లు సాధించి అత్యుత్తమ ఫలితాలను అందించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను జె.యశ్వంత్ సాయి, స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను ఎమ్.మారుతి సత్యశ్రీకర్, స్టేట్ 5వ ర్యాంక్‌ను పీవీఎన్ సూర్య ధావన్, స్టేట్ 6వ ర్యాంక్‌ను ఎమ్‌కేస్ సాకేత్, స్టేట్ 8వ ర్యాంక్‌ను డి.శ్రీవేద్, స్టేట్ 10వ ర్యాంక్‌ను సీహెచ్ త్రివేణి కైవసం చేసుకున్నారని తెలిపారు. పదిలోపు 8 మంది, 50లోపు 26 మంది, 100లోపు 46 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అమలాపురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మృతి





దేవరపల్లి, మే 15: ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తోకల శ్రీహరి (56) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 6గంటలకు విజయవాడ బయల్దేరగా దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉదయం 11.40 నిమిషాలకు ఎదురుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సూరయ్యపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ తోకల శ్రీహరికి తీవ్ర గాయాలవడంతో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీహరి అన్నయ్య తోకల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

మటన్ కూర వండలేదని మనస్తాపం

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 15 : తాను చెప్పినా మటన్ కూర వండలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన ఐశెట్టి వీర్రాజు(38) కార్పెంటర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య కృష్ణవేణిని మటన్ కూర వండమన్నాడు. వండకపోవడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో భార్య, కుమార్తెను తీసుకుని పక్కనే ఉన్న అమ్మగారింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు తెరచి, భర్త చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీర్రాజు తల్లి చక్ర సత్యవతి అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

బ్లేడ్ బ్యాచ్ యువకులకు రెండేళ్ల జైలు


రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): దారిదోపిడీ కేసులో ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించింది. సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022 అక్టోబరు 11న రాత్రి 9గంటల ప్రాంతంలో ధవళేశ్వరం కంచరలైన్ మెయిన్ రోడ్‌లో 15ఏళ్ల బాలుడు ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌పై బస్టాండ్ వద్దకు వెళ్లాడు. ఆ బాలుడిని ధవళేశ్వరానికి చెందిన అప్పల బత్తుల కృష్ణ వంశీ (దొంగోడు), కూరపాటి సతీశ్ (చేతబడి), ఉమ్మాడి సాయి గణేశ్(సాయి) అడ్డగించారు. బ్లేడు చూపించి భయపెట్టి ప్రభుత్వాస్పత్రి వద్దకు తీసుకెళ్లి ఆటోలో ఎక్కించి చితక్కొట్టారు. దీంతో ఆ బాలుడి శరీరంపై గాయాలయ్యాయి. బలవంతంగా బాలుడి చేతికి ఉన్న వాచీ, రూ.100 లాక్కొని, విషయం బయటకు చెబితే బ్యారేజీ పైనుంచి గోదావరిలో పడేస్తామని బెదిరించారు. బాలుడు ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తాత పట్నాల జువ్వలుకు చెప్పాడు. ఆయన ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి డి.విజయ్ గౌతమ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి శంభూప్రసాద్, దర్యాప్తు అధికారి అయిన అప్పటి సీఐ కె.మంగాదేవి, విచారణ ప్రక్రియను పర్యవేక్షించిన డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ వి.వినయ్ మోహన్, కోర్టు ఏఎస్ఐ జి.వెంకటేశ్వర్లును ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎనిమిది కాసుల బంగారం చోరీ

చెరకు రసంలో మత్తుమందు కలిపి ఆభరణాలు చోరీ చేసిన మహిళ

అనపర్తి, మే 15 : అనపర్తిలో బుధవారం గుర్తు తెలియని మహిళ ఒక వృద్ధురాలికి మాయ మాటలు చెప్పి చెరుకు రసంలో మత్తుమందు కలిపి ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలతో పరారైంది. ఎస్ఐ రామారావు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదురుగా గల ఇంటిలో సత్యం సత్యవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. భర్త చనిపోవడం ఇద్దరు కుమార్తెలు కుమారుడు దూరంగా ఉండటంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. గత నాలుగు రోజుల నుంచి సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ వృద్ధురాలితో పరిచయం పెంచుకుంది. పనుల్లో సహాయపడుతూ నమ్మకం సంపాదించింది. బుధవారం ఆమె చిన్న కుమార్తె తల్లిని చూసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న మహిళను మీరెవరు అని ప్రశ్నించగా తనకు సత్యవేణి బాగా తెలుసునని నమ్మించింది. కుమార్తె వెళ్లగానే తనతో ప్లాస్టిక్ బాటిల్‌లో తెచ్చిన చెరుకు రసం వృద్ధురాలికి ఇచ్చింది. దీంతో వృద్ధురాలు మత్తులోకి వెళ్లగా బంగారు గొలుసు, ఉంగరాలు తీసుకుని అక్కడి నుండి ఉడాయించింది. స్పృహలోకి వచ్చిన తర్వాత వృద్ధురాలు జరిగిన విషయాన్ని కుమార్తెకు వివరించింది. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పరిసరాల్లోని సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీఆర్జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



మామిడికుదురు, మే 15: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు చెందిన లిఖితపూడి హరిసత్యరామ్మోహన్ ఏపీ ఆర్జేసీ 2024 ప్రవేశ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మంగళవారం రాత్రి ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రకటించారు. ఎంఈసీ విభాగంలో 150 మార్కులకు 140మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడని విద్యార్థి తండ్రి రమేష్ తెలిపారు. రామ్మోహన్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే లక్ష్యమన్నారు. పదో తరగతిలో రామ్మోహన్ 580మార్కులు సాధించాడు.

పిఠాపురంలో మజ్జిగ పంపిణీ

పిఠాపురం, మే 15: పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద గల ఆదర్శ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పుట్టినరోజు పురస్కరించుకుని చేపట్టిన మజ్జిగ పంపిణీని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్ ప్రారంభించారు. అక్కడ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే ప్రశాంతంగా పోలింగ్

అత్యధికం 95.19, అత్యల్పం 54.38

రిటర్నింగ్ అధికారి సీతారామారావు


సీతారామారావు

పెద్దాపురం, మే 15: ప్రజలు, పోలింగ్ సిబ్బంది, రాజకీయపార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధుల సమష్టి సహకారంతోనే పెద్దాపురం నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు పెద్దాపురం ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామా రావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. పోలింగ్ ముగింపు తరువాత ఈవీఎంలను కాకినాడ జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూముల్లో భారీ బందోబస్తు నడుమ భద్రపరచడం జరిగిందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న 201 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో 2,15,095 మంది ఓటర్లకుగాను 1,76,993 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. స్వీప్ లక్ష్యంతో నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదైందన్నారు. పెద్దాపురం మండలం ఉలిమేశ్వరంలో 95.19 శాతం పోలింగ్ నమోదుకాగా పెద్దాపురం అర్బన్ పరిధిలో 81వ బూత్‌లో 54.38 శాతం పోలింగ్ నమోదయ్యిందన్నారు. పోలింగ్‌కు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రాక్షస పాలన సంకెళ్ల నుంచి విముక్తికి కృషి

కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల


తంగెళ్ల ఉదయ్

కార్పొరేషన్ (కాకినాడ), మే 15: రాక్షస పాలన సంకెళ్ల నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేస్తానని కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల రోజు ఇతర రాష్ట్రాల నుంచి సైతం తరలివచ్చి భారత ప్రధాని నరేంద్రమోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీస్సులతో కాకినాడ ఎంపీగా పోటీచేసిన తనపై అంతులేని ప్రేమ చూపించి ఓట్ల వర్షం కురిపించిన జిల్లా ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఈ మహాయజ్ఞంలో అహర్నిశలు శ్రమించి, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

లింక్ ఏఆర్టీ సెంటర్ సేవలు వినియోగించుకోండి

అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్

పెద్దాపురం, మే 15: లింక్ ఏఆర్టీ సేవలను హెచ్ఐవీ బా బాధితులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ కోరారు. పట్టణంలోని స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ విభాగంలో లింక్ ఏఆర్టీ సెంటర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాజిటివ్ అయిన కేసులు ఏఆర్టీ రిజిస్ట్రేషన్ చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రోగులు ఇకపై కాకినాడకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. అనంతరం లింక్ ఏఆర్టీ సెంటర్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరిన్‌టెండెంట్ డాక్టర్ సతీష్ రెడ్డి, పీఎం ఆదిలింగం, ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరం

పిఠాపురం, మే 15: పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల రాజీవ్‌గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నుంచి బాలబాలికల ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొత్తెం సుందరకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారటీ, ఉమ్మడి తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనే బాలబాలికలకు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందించనున్నట్లు చెప్పారు. రోజూ ఉదయం 6నుంచి 8గంటల వరకూ, సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకూ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు శిక్షణలో పాల్గొనాలని కోరారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రావణి ఎంపిక


శ్రావణి

పిఠాపురం, మే 15: జాతీయ బాస్కెట్‌బాల్ జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలకు పిఠాపురం పట్టణానికి చెందిన క్రీడాకారిణి కె.శ్రావణి ఎంపికైంది. ఆమె మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో త్వరలో జరిగే జాతీయ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈమె గతంలో నాలుగు పర్యాయాలు జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. శ్రావణిని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు బొజ్జా మాణిక్యాలరావు (అయలు), కొత్తెం సుందరకుమార్, నంబల అర్జున్, బొజ్జా సతీష్, దుర్గాప్రసాద్ అభినందించారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

కాకినాడ సిటీ, మే 15: బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ మూడో వార్షికోత్సవం సందర్భంగా కాకినాడలో 20రోజులపాటు నిర్వహించిన చిన్నారుల వేసవి శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక జగన్నాథపురంలోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం శిక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమానికి ఫ్యాకల్టీ అర్చన ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథులుగా ట్రస్ట్ ట్రస్టీలు వీఎస్ఎన్ మూర్తి, భారతి, సత్యశాంతి, విశిష్టఅతిథులుగా ట్రస్ట్ సభ్యులు రామారావు, తాతారావు పాల్గొన్నారు. పేద విద్యార్థికి చదువుకు స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, నాగేంద్రకుమార్, నాగబాబు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన అవగాహన సదస్సు

ఏలేశ్వరం, మే 15: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం ఏలేశ్వరం గ్రంథాలయాధికారి కవికొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు చెన్నాప్రగడ సత్య గాంధీ, ఎబివి.ప్రసాద్, పుల్లయ్య, మజ్జి నాగేశ్వరరావు తదితర విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు కథలు రాయడం, చిత్రలేఖనం, యోగా సాధన, గణితం, ఇంగ్లీషు, పుస్తక అధ్యయనం పలు అంశాలపై అవగాహన కల్పించారు.

జూన్ 9న అరసం మహాసభ

పోర్టుసిటీ (కాకినాడ), మే 15: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) కాకినాడ జిల్లా మహాసభ జూన్ 9న నిర్వహిస్తున్నామని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వివరించారు. సాహితీవేత్తలు, రచయితలు ఈ నెలాఖరులోగా సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. మూడేళ్ల కాలపరిమితికిగాను సభ్యత్వ రుసుం రూ.100 చెల్లించాలన్నారు. వివరాలకు 9493281776లో సంప్రదించవచ్చని తెలిపారు.

వలస ఓటర్లు తిరుగుపయనం

ప్రత్తిపాడు, మే 15: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన వలస ఓటర్లు అధికంగా ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటు వేసి తిరిగి తాము వెళ్లాల్సిన ప్రాంతాలకు వెళ్తున్నారు. మండలంలోని చినశంకర్లపూడికి చెందిన 500 మంది ఓటర్లు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వలస కార్మికులుగా పనులకు వెళ్లడంతో వారందరినీ గ్రామ టీడీపీ నాయకుడు మిరియాల శ్రీను చినశంకర్లపూడి గ్రామానికి రప్పించి ఓట్లు వేసే అవకాశం కల్పించారు. దీంతో వారందరూ ఓటు హక్కు వినియోగించుకుని మంగళవారం స్వగృహాల వద్ద విశ్రాంతి తీసుకుని బుధవారం వారు పని చేసే ప్రాంతాలకు రైళ్లు బస్సుల్లో తరలివెళ్లారు.

ప్రమాదభరితంగా వంతెన

పూర్తిగా శిథిలమైన రెయిలింగ్


శృంగవరం శివారు రెయిలింగ్ లేని వంతెన

రౌతులపూడి, మే 15: మండలంలో బంగారయ్యపేట, శృంగవరం గ్రామశివారు ఏటి కాలువపై బ్రిటిష్ కాలం నాటి వంతెన ప్రమాదభరితంగా ఉంది. వంతెనకు రెండు వైపులా ఉన్న రెయిలింగ్ పూర్తిగా శిథిలం అయ్యింది. కాకినాడ, రాజమండ్రి, అన్నవరం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెనపై నుంచే వాహనదారులు ప్రయాణాలు సాగిస్తూంటారు. అయితే వంతెనకు రెయిలింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలు బారినపడుతున్నారు. ఎస్.పైడిపాల, మూలగపూడి, ఉప్పపాలెం, మల్లంపేట గ్రామాల నుంచి క్వారీ మెటల్ తరలించే భారీ వాహనాలు రాకపోకలతో వంతెన రైలింగ్ శిథిలమైనట్టు ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెయిలింగ్ నిర్మించాలని లేకుంటే ప్రమాద హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేసి ప్రమాదాలు బారి నుంచి రక్షించాలని వాహనదారులు అధికారులను కోరతున్నారు.

భారీ పోలింగ్.. ఎవరికి లాభం, ఎవరికి నష్టం!

» ఓటు వేసేందుకు తరలివచ్చిన జనం » పెద్దాపురంలో ఎవరికి వారే గెలుపుపై ధీమా

సామర్లకోట, మే 15: పెద్దాపురం నియోజకవర్గంలో నమోదైన భారీ పోలింగ్ ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే విధంగా చర్చలు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతున్నాయి. ఈ పోలింగ్‌లో 82.29 శాతం నమోదు కావడం కూడా టీడీపీ విజయానికే సంకేతం అని ఆపార్టీ విశ్లేషకులు లెక్కలు వేస్తున్నారు. పోస్టల్ బ్యాలట్‌లో కలిపితే ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది. ఓటుకు రూ.2వేలు నియోజకవర్గమంతటా పంచామని మాదే గెలుపు అని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చిన వైసీపీ నాయకులు ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వేసుకున్న గణాంక వివరాల్లో క్షేత్రస్థాయిలో భారీగా తేడాలు కనిపించడంతో కొందరు నాయకులు డీలాపడినట్టు తెలిసింది. డబ్బులు తీసుకుని ఓటింగ్‌కు నారి వారి జాబితాలు చేతబట్టి రికవరీ పనిలో అధికార పార్టీ నాయకులు ఉన్నట్టు తెలిసింది. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన ఏ ఎన్నికల్లో సోమవారం వచ్చినా 82.29 శాతం పోలింగ్ నమోదు కాలేదు. అయితే అత్యధిక పోలింగ్ శాతం తమకే సానుకూలంగా ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎంతో ధీమా వ్యక్తం చేస్తుండడం విశేషం. అయితే తమ ప్రభుత్వంలో అమలు చేసిన అబివృద్ధి పథకాలతో తమకు అధిక శాతం ఓటర్లు మద్దతు పలికారని మరోపక్క వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు. అయితే అధికార పార్టీ అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకే గంటల తరబడి మండుటెండను సైతం లెక్కించకుండా ఓట్లేసారని ఇది ముమ్మాటికీ టీడీపీ విజయానికి దోహదపడుతుందని కూటమి పార్టీల నాయకులతో బాటూ క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణులు సైతం తమదైన శైలిలో లెక్కలు వేస్తున్నారు. గత 2దఫాలుగా ఎమ్మెల్యేగా నిమ్మకాయల చినరాజప్ప గెలుపొందగా 2024 ఎన్నికలకు ప్రజల నుంచి వచ్చిన సానుకూల స్పందన గతంలో ఎన్నడూ లేదని, కూటమి ఏర్పాటుతో ఇది ఫలించి చినరాజప్ప మూడవ దఫా గెలుపొందడం ద్వారా హ్యాట్రిక్ సాధిస్తారని పార్టీ శ్రేణులు అత్యంత ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా అబివృద్ధి, సంక్షేమం లేని పెద్దాపురం నియోజకవర్గాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా చినరాజప్ప హయాంలో సాధించిన అబివృద్ధికి, నేటికీ బేరీజు వేసుకోవడం ద్వారా ఓటర్లు గంటల తరబడి నిలుచుని ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా విజ్ఞత ప్రదర్శించారని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ఏర్పాటుతో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ప్రచారం చేయడం టీడీపీ గెలుపునకు మార్గాలు సులభతరమయ్యాయని అదే తమ పార్టీ విజయావకాశాలకు దారితీస్తాయని వారు అత్యంత ధీమాతో చెబుతున్నారు. సాధారణంగా ఓటువేశాక ఓటరు తన మనసులోని అభిప్రాయాన్ని బయటపెడుతుంటారని, కానీ ఈ దఫా అలా జరుగలేదని చెబుతున్నారు. దీనిని ఆధారంగా చూస్తుంటే ప్రజలు ఎవరి వైపు మొగ్గుచూపారన్నది జూన్ 4వ తేదీన తేలుతుందని అంటున్నారు.

విజయం ఎవరికో?

కిర్లంపూడి, మే 15: సార్వత్రిక ఎన్నికలు సోమవారం ముగియడంతో మండలంలో ప్రధాన పార్టీ అభ్యర్థులు తమ గెలుపును బేరీజు వేసుకుంటున్నారు. పార్టీ ముఖ్యనేతలు, అనుచరులతో సమీక్షలు జరుపుతున్నారు. బూత్‌ల వారీగా ఎంత ఓటింగ్ పడుతుందో అంచనాలు వేసుకుంటున్నారు. ఎక్కడ మెజార్టీ వస్తుందో ఎక్కడ నష్టం వాటిల్లుతుందో అనే అంశాలపై నిమగ్నమయ్యారు. పోలింగ్ ముగిసిన నాటి నుంచి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి, ఏపార్టీకి మెజార్టీ వస్తుందో అనే చర్చ జరుగుతుంది. దాదాపు 3 నెలల నుంచి అభ్యర్థులు విశ్రాంతి లేకుండా పార్టీ కార్యక్రమాలు, ప్రచారాల్లో మునిగిపోయారు. పార్టీ కేడర్‌తో ప్రచారం చేశారు. పోలింగ్ అనంతరం ఒక రోజు విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు నుంచి విజయంపై సమీక్షలు జరుపుతున్నారు.

సర్ ఆర్థర్ కాటన్ భావి ఇంజనీర్లకు స్ఫూర్తి

జేఎన్టీయూకే రిజిస్ట్రార్

కాటన్‌కు ఘన నివాళి




జేఎన్టీయూకే: కాటన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సామర్లకోట: రైతుల నివాళి, కొత్తపల్లి: కాటన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, మే 15: భావి ఇంజనీర్లు సర్ ఆర్థర్ కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని జేఎన్టీయూకే రిజిస్ట్రార్ ఎల్.సుమలత అన్నారు. వర్సిటీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, కాకినాడ లోకల్ సెంటర్ భవనంలో బుధవారం ఉదయం సర్ ఆర్థర్ థామస్ కాటన్ 221వ జయంతిని ఐఈ కాకినాడ లోకల్ సెంటర్, ఆర్ఐఈఏకేల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్.సుమలత ముఖ్యఅతిథిగాను, విశ్రాంత ఎస్ఈ ఎన్.అర్జున్‌రావు విశిష్టఅతిథిగాను పాల్గొనగా ఐఈకేఎల్సీ చైర్మన్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులంతా కలిసి సర్ ఆర్థర్ కాటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.జయప్రసాద్, ఎన్.కృష్ణారావు, వి.కృష్ణారావు అధ్యాపకులు పాల్గొన్నారు.

కాటన్ చిరస్మరణీయుడు

సామర్లకోట, మే 15: ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి అపరభగీరథుడిగా కీర్తిప్రతిష్ఠలు పొందిన సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడని సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ రైతు సంఘ నాయకులు కొండపల్లి జగ్గారావు, చలికి వీర్రాజు, కొండపల్లి కృష్ణమూర్తి, గోలి వెంకట్రావు, గోలి శ్రీరామ్ పేర్కొన్నారు. కాటన్ జయంతిని సామర్లకోట మండలం వేట్లపాలెం గోదావరి కాలువ ఒడ్డున కాటన్ విగ్రహం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు ప్రతినిధులతో పాటూ రైతులు సైతం కాటన్ మహాశయునిపై ఉన్న అభిమానాన్ని చాటుతూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మళ్ళ రాజు, పాలకుర్తి బాసయ్య, గుమ్మళ్ళ రామకృష్ణ, యరమాటి రామకృష్ణ, నున్న గొల్లబ్బాయ్, బిక్కిన గోవిందు, అమటం వెంకటేశ్వరరావు, పాలచర్ల రాజు, యరమాటి రాంబాబు, సంగమేశ్వరరావు, చిల్లే మోహనరావు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచిన కాటన్

కొత్తపల్లి, మే 15: గోదావరిపై ఆనకట్ట నిర్మించి వేలాది ఎకరాల భూములకు సాగు,తాగునీరు అందించి ప్రజల హృదయాల్లో చిరస్మరనీయులుగా సర్ ఆర్థర్ కాటన్ నిలిచారని విగ్రహ దాతల్లో ఒకరైన గాది వెంకటరావు తెలిపారు. బుధవారం కొండెవరంలో ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ధవలేశ్వరంలో బ్యారేజీ నిర్మించి సుమారు 150 ఏళ్లు గడచినా గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్‌దొర చిరంజీవిగా నిలిచారన్నారు. అడబాల అప్పలరాజు, గాది శ్రీను, గాది భాస్కరరావు, బర్రె వీరభద్రరావు, గాది చక్రబాబు ఉన్నారు.

పార్టీ కేడర్‌ని ముందుండి నడిపించారు

మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులను సత్కరించిన కూటమి అభ్యర్థి పంతం నానాజీ


పిల్లి దంపతులను సత్కరిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మే 15: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం పొత్తు ధర్మాన్ని పాటించి పార్టీ కేడర్‌ని సమన్వయం చేస్తూ ముందుండి నడిపించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతుల సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. బుధవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే దంపతులను మర్యాద పూర్వకంగా కలుసుకుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ రాజకీయంగా టీడీపీలో సీనియర్ నాయకులుగా పిల్లి దంపతులకు మంచి గుర్తింపు ఉందన్నారు. పొత్తులో జనసేనకు టిక్కెట్టు కేటాయించడంతో పార్టీ నిర్ణయం మేరకు సీనియర్ ఎమ్మెల్యేనన్న బేషాజాలకు పోకుండా తన వెన్నంటి ఉండి కూటమి అభ్యర్థిగా తన విజయం కోసం చేసిన కృషి మరవలేనన్నారు. రాబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమని, భవిష్యత్తులో కలసిమెలసి ఐకమత్యంగా పని చేద్దామన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పని చేశామని ఎమ్మెల్యేగా నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లు మంచి మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బోళ్ల కృష్ణమోహన్, కాలా శ్రీను, వాసంశెట్టి త్రిమూర్తులు, టేకుమూడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'కూటమి విజయం తథ్యం'

సర్పవరం జంక్షన్, మే 15: జగన్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్న దానికి నిదర్శనం పోలింగ్ శాతం పెరగడమని, ఓట్ల సునామీతో కూటమి అభ్యర్థుల విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు అన్నారు. బుధవారం వలసపాకల నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌ని గద్దె దింపేందుకు ప్రజలు కంకణం కట్టుకుని జాతరలా తరలివచ్చి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకు కసితో ఓట్లేశారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యమన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు అనంతరం సంబరాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లు అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. కూటమికి మద్దతుగా పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, పార్టీ నాయకులు బోళ్ల కృష్ణమోహన్, మిరపల ప్రకాశ్, బొజ్జ భవానిసాంబశివరావు, కొల్లుబోయిన అచ్చుత్, పిల్లి రామకృష్ణ తదితరులున్నారు.

వంతెనపై పడిన పెద్ద బండరాయి



రౌతులపూడి, మే 15: రౌతులపూడి శివాలయం వద్ద వంతెనపై బుధవారం రాత్రి పెద్ద క్వారీ బండరాయి పడింది. రాయి పడిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎస్.పైడిపాల, మల్లంపేట, మూలగపూడి సమీపంలో క్వారీల నుంచి పెద్దపెద్ద బండరాళ్లను ఉప్పాడ తరలిస్తున్నారు. రాళ్లు తరలించే సమయంలో వేగంగా వెళ్లడం, లారీల్లో భారీగా రాళ్లు వేయడంతో రాళ్లు కింద పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ లారీల తీరుపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు

పసరు రంగులో తాగునీరు



సామర్లకోట, మే 15: పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా మున్సిపాల్టీ సరఫరా చేయాల్సిన తాగునీరు బుధవారం పసరు రంగులో రావడంతో ప్రజలు ఆ నీరు తాగేందుకు ఉపయోగపడకపోవడంతో ఆందోళన చెందారు. అసలే వేసవి జలాశయంలో నీటినిల్వలు అంతంత మాత్రమే ఉం డడం, పలు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకుల కార ణంగా పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడం వంటి కారణాలతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు బుధవారం క్లోరినేషన్‌లేని తాగునీటిని సరఫరా చేయడంతో పలు వార్డులలో మహిళలు ఖాళీబిందెలుతో ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది. దీనిపై మున్సిపల్ అధికారులకు పలువురు ఫిర్యాదులు చేసినా ఏ ఫలితం లేకపోవడంతో మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకూ ఎదురు చూసినా కనీసం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయలేదని పలువురు వాపోయారు.

ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటా

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న వర్మ

పిఠాపురం, మే 15: నియోజకవర్గంలోని ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండి వారికి అన్నివిధాలా అండగా నిలుస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం వర్మ జన్మదినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు వర్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌లు కట్ చేయించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశానన్నారు. ఎల్లవేళలా ప్రజాసేవకుడిగా ఉండి సేవలందిస్తానని, నియోజకవర్గ ప్రజలకే తన జీవితం అంకితమన్నారు. ఏ ఒక్కరికి కష్టమొచ్చినా వర్మ అక్కడ ఉంటాడని చెప్పారు. వర్మ పుట్టినరోజు సందర్భంగా జనసేన అధినేత పవన్ పంపిన పుష్పగుచ్ఛాన్ని ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ కుమార్,పంచకర్ల సందీప్ వర్మకు అందజేశారు.

పాదగయలో పూజలు

పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. వర్మకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.

కూటమిదే విజయం : వరుపుల సత్యప్రభ


సత్యప్రభతో సమావేశమైన ఎంపీపీలు

ప్రత్తిపాడు, మే 15: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే విజయమని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ చెప్పారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, యర్రవరం, సిరిపురం, వెంకటనగరం, చింతలూరు, ధర్మవరం, అచ్చంపేట, శంఖవరం, పెదశంకర్లపూడి గ్రామాల కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రత్తిపాడు తరలివచ్చి సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో కూటమి పట్ల సానుకూలత నెలకొందని, ఉమ్మడి మేనిఫెస్టోలకు ప్రజల మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, కొమ్ముల కన్నబాబు, ఏలేశ్వరం, కిర్లంపూడి ఎంపీపీలు గొల్లపల్లి నరసింహమూర్తి, తోట రవి, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, గొంతిన సురేష్, బొల్లుకొండబాబు, దాట్ల అప్పన్నబాబు, బుద్దరాజు చంటిరాజు, సూది బూరయ్య, వైభోగుల సుబ్బారావు, అడ్డాల త్రిమూర్తులు, బస్వా ప్రసాద్, సూర్నీడి సురేష్,కొప్పన రాజబాబు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్స్ సందర్శించిన ఆర్వో


స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఆర్వో వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), మే 15: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు బుధవారం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. జేఎన్టీయూకే సివిల్ బ్లాక్ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లవద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి ఇతర అంశాలపై ఎన్నికల అధికారులతో చర్చించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారన్నారు. సిటీలో 72.07శాతం ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 6శాతం ఓటింగ్ పెరిగిందని ఆర్వో చెప్పారు.

జ్యోతుల నెహ్రూను కలిసిన సత్యప్రభ


జ్యోతుల నెహ్రూతో మాట్లాడుతున్న సత్యప్రభ

జగ్గంపేట, మే 15: జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల పోలింగ్‌పై వారిద్దరూ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పరిమి బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోఆర్డినేటర్‌కు సత్కారం



జగ్గంపేట, మే 15: జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల టీడీపీ కోఆర్డినేటర్ ఎస్వీఎస్ అప్పలరాజును బుధవారం కొత్తపల్లి బాబు టీమ్ సభ్యులు సత్కరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరగడానికి కృషి చేసిన అప్పలరాజును అభినందించారు. టీడీపీ నాయకుల్లో చైతన్యం తీసుకువచ్చి అన్ని గ్రామాల్లో బూత్‌ల వారీగా పోలింగ్ జరిపించారన్నారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

తుమ్మలపల్లికి నాగబాబు అభినందన

జగ్గంపేట, మే 15: గొల్లప్రోలులో బుధవారం జరిగిన పిఠాపురం నియోజకవర్గ జనసైనికుల కృతజ్ఞత సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు తుమ్మలపల్లి రమేష్‌ను అభినందించారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌కి రమేష్ పూర్తి మద్దతిచ్చి వారి విజయానికి ఎంతో కృషి చేశారని నాగబాబు కొనియాడారు.

శివకిరణ్ స్వామీజీకి స్వాగతం

ప్రత్తిపాడు, మే 15: కాశ్మీర్ నుంచి కన్యాకుమారికి పాదయాత్ర చేపట్టిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ శివకిరణ్ స్వామీజీ పాదయాత్ర బుధవారం ప్రత్తిపాడుకు చేరుకుంది. స్థానిక ప్రముఖులు రాసంశెట్టి రాజా, కర్రి ధర్మరాజు, చిట్ర అప్పారావు తదితరులు స్వాగతం పలికారు. దేశం సుభిక్షంగా ఉండాలని యాత్ర చేస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయ బోర్లు కేబుల్స్ చోరీ

రౌతులపూడి, మే 15: బలరామపురం గ్రామంలో బుధవారం అర్థరాత్రి వ్యవసాయ బోర్లు కేబుల్స్ చోరీ గురయ్యాయి. యాగదాసు అర్జునరావు, తోటకన్నారావు, తోట సుబ్రహ్మణ్యం, ఎ.మల్లవరంలో కే.నానికి చెందిన రైతుల విద్యుత్ మీటర్ కేబుల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మోటరు కూడా పట్టుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్టు రైతులు తెలిపారు. కేబుల్స్ చోరి వల్ల విద్యుత్ మోటర్లు పనిచేయకపోవడంతో పశువులకు తాగునీరందడంలేదని ఆందోళన చెందుతున్నారు.

పేద మహిళకు ఆర్థిక సహకారం

సర్పవరం జంక్షన్, మే 15: కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మూర్తి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పాలిక నరసింహమూర్తి బుధవారం నిరుపేద మహిళకు రూ.10 వేలు నగదు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులను అందించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దొంగల పైడమ్మ భర్త మృతితో కుటుంబ పోషణ కష్టంగా ఉండటాన్ని గుర్తించి సహకారం అందించానన్నారు.

హెల్త్ సెంటర్ వద్ద రోగులు క్యూ



జగ్గంపేట,మే 15: జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం రోగులు క్యూ కట్టారు. వైద్యానికి వచ్చిన రోగులు ముందుగా ఓపీ తీసుకోవాలి. ఆసుపత్రికి వచ్చేరోగులు వివరాలు యాప్‌లో నమోదు చేసి ఓపీ కాగితం వారికి ఇవ్వాల్సి ఉంది. యాప్ సర్వర్ ప్రక్రియ ఆలస్యం అవడంతో రోగులు గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.